దోపిడీ దొంగల హంగామా

నందిగామ, జూలై 28: నందిగామ మండల కేంద్రంలో శనివారం రాత్రి దోపిడీ దొంగలు హంగామా సృష్టించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల రాము శనివారం రాత్రి డ్యూటీకి వెళ్లడంతో ఇంట్లో ఎవరు లేరని గమనించిన దొంగలు తాళాలు పగులగొట్టి బీరువాలోని రూ.35,000 నగదును ఎత్తుకెళ్లారు. అదే విధంగా దుండగులు మరో రెండు ఇండ్లలోనూ చోరీకి యత్నించారు. ఆదివారం ఉదయం రమేశ్ ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగులగొట్టి ఉండటంతో 100 డయల్ చేసి పోలీసులకు సమచారం అందించారు. నందిగామ సీఐ ప్రసాద్, ఎస్ఐ గోపాలకృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీంచారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలి

షాద్‌నగర్, జూలై28: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గురుకుల పాఠశాల ఆవరణలో రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలను నాటిన అనంతరం మాట్లాడారు. నేటి తరం చిన్నారులు విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలని, ఆ దిశగా మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. అడవుల నరికివేతను ప్రోత్సహించరాదని చెప్పారు. సకాలంలో వర్షాలు కురువాలంటే అడవులే ప్రధాన కారణమనే విషయాన్ని గ్రహించాలని తెలిపారు. అనువైన ప్రతిచోట విస్తారంగా మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు రవీందర్ గౌడ్, అజీజ్, మాజీ జడ్పీటీసీ పి. వెంకట్రాం రెడ్డి, మాజీ ఎంపీటీసీ అరుణమ్మ అంజయ్య, మాజీ సర్పంచ్ నర్సింహ, నాయకులు బాలరాజుగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, గురుకుల పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో కలిసి మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



రాష్ట్ర ముదిరాజ్ సంఘం కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌కు బొకే అందజేస్తున్న చేవెళ్ల మండల ముదిరాజ్ సంఘం సభ్యులు

కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన ముదిరాజ్ నేతలు

చేవెళ్లటౌన్, జూలై 28: తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను ముదిరాజ్ సంఘం సభ్యులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తామన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నర్సింహులు, యువజన అధ్యక్షుడు శ్రీకాంత్, గణేశ్, కావలి శ్రీనివాస్, చామంతి శివరాజ్, కృష్ణమోహన్, భిక్షపతి, గోపాల్, బాలయ్య, యాదయ్య, ముదిరాజ్ నాయకులు ఉన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

షాబాద్, జూలై 28: షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోట కలుసుకొని నాటి జ్ఞాపకాలను వారు గుర్తు చేసుకొని వారికి పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అమృత్‌రాజు, సంజీవరెడ్డి, ముకుందరెడ్డి, మహేశ్, అరుణ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు

ఫారెస్టు అధికారులకు అప్పగింత

యాచారం, జూలై28: కుక్కల దాడిలో గాయపడిన ఓ జింకను స్థానికులు కాపాడారు. గాయపడిన జింకకు ప్రథమ చికిత్స అందించి ఫారెస్టు అధికారులకు అప్పగించారు. అటవీశాఖ అధికారులు తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని నందివనపర్తి గ్రామానికి చెందిన పంబాల యాదయ్య వ్యవసాయ పొలంలో ఓ జింక దర్శనమిచ్చింది. అది కదల్లేని స్థితిలో ఉండటాన్ని చూసిన రైతు యాదయ్య జింకపై కుక్కలు దాడి చేస్తుండగా, వాటిని అక్కడినుంచి తరిమాడు. ఈ విషయాన్ని మాజీ సర్పంచ్ రాయికంటి విజయ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చాడు. అతడు స్థానికులతో ఘటనా స్థలానికి చేరుకున్నాడు. విజయ్‌కుమార్ తాటిపర్తి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. తాటిపర్తి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ మహ్మద్ షరీఫ్ తన సిబ్బందితో కలిసి హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. గాయపడిన జింకను ఫారెస్ట్ సిబ్బంది యాచారం పశు వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యాధికారిణి రేఖ అందుబాటులో లేకపోవడంతో దవాఖాన సిబ్బందితో కలిసి ఫారెస్టు అధికారులు జింకకు ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం అటవీ శాఖ అధికారులు జింకకు పూర్తి స్థాయిలో వైద్యం చేయించిన అనంతరం పార్కుకు లేదా అటవీలో వదిలేయనున్నట్లు తాటిపర్తి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ షరీఫ్ తెలిపారు.

జింకకు ప్రథమ చేయిస్తున్న నందివనపర్తి మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్, తదితరులు

పాతకక్షలతో వాహనాలు దగ్ధం

పెద్దఅంబర్‌పేట, జూలై 28: పాతకక్షలు మంటలు రేపాయి. గతంలో తన బైక్ సీటును కోసేశారని మనసులో పెట్టుకున్న ఇద్దరు మరో ఇద్దరు మైనర్ల సాయంతో బైకులను తగులబెట్టారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో శనివారం అర్ధరాత్రి తర్వాత ఈ ఘటన జరిగింది. మహేందర్, శివ మరో ఇద్దరు మైనర్లతో కాలనీలోని ఫ్లాట్ల బయట పార్కు చేసిన బైకులకు నిప్పు పెట్టించినట్టు పోలీసులు తెలిపారు. అంతా నిద్రిస్తున్న సమయంలో బైకులకు నిప్పు పెట్టగా.. మంటలు చెలరేగాయి. దీంతో పక్కనున్న వాహనాలు సైతం దగ్ధమయ్యాయి. మొత్తం ఏడు ద్విచక్ర వాహనాలు కాలిబూడిదయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు.

దగ్ధమైన వాహనాలు

హాస్టల్‌లో హత్య

ఎస్ఆర్ నగర్‌లో దారుణం

వెంగళరావునగర్, జూలై 28: క్షణికావేశంలో రూమ్మేట్‌గా ఉపాధ్యాయుడిని హాస్టల్‌లో హత్య చేశాడు. స్నేహితుడితో కలిసి మద్యం మత్తులో ఆలస్యంగా హాస్టల్‌కు వచ్చి.. నిద్ర పాడు చేసిన రూమ్మేట్‌ను ప్రశ్నించడమే ఆ ఉపాధ్యాయుడి ప్రాణాన్ని బలిగొంది. ఆవేశానికి లోనైన క్షురకుడు తన వద్ద ఉన్న కత్తితో గొంతు కోసి చంపేశాడు. ఈ దారుణం ఎస్ఆర్ నగర్‌లోని హనుమ యోగలక్ష్మి అన్నపూర్ణ బాయిస్ హాస్టల్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కథనం ప్రకారం.. కర్నూలు జిల్లాకు చెందిన వెంకటరమణ(38)ధరంకరం రోడ్డులోని ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగేండ్లుగా ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తూ.. ఎస్ఆర్ నగర్‌లోని హనుమ యోగాలక్ష్మి అన్నపూర్ణ బాయిస్ హాస్టల్‌లోని రూమ్ నం.10లో ఉంటున్నాడు. వెంకటరమణ ఉంటున్న షేరింగ్ రూమ్‌లోనే ఏలూరు నివాసి గణేశ్ (28) కూడా రెండు నెలలుగా ఉంటున్నాడు. వీరితో పాటు ఇదే గదిలో కేశవ్‌సింగ్, అజయ్, అరుణ్ కూడా ఉంటున్నారు. క్షౌర వృత్తి చేసే గణేశ్ హాస్టల్ సమీపంలోనే ఉన్న సెలూన్‌లో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి మరో మిత్రుడితో కలిసి గణేశ్ మద్యం తాగాడు. తాను ఉంటున్న హాస్టల్ గదిలోకి వస్తూ తలుపులను కాలితో తన్నాడు. దీంతో పెద్ద శబ్దం రావడంతో నిద్రలేచిన వెంకటరమణ ఇదేమిటని, ఎందుకు గొడవ చేస్తున్నావని ప్రశ్నించాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం గణేశ్ తన మిత్రుడితో కలిసి గదిలోనే బిర్యానీ తిన్నాడు. అ తరువాత కూడా తలుపును పెద్దగా చప్పుడు చేయడంతో మళ్లీ నిద్రలేచిన వెంకటరమణ.. శబ్దం చేసి మా నిద్రకు ఎందుకు భంగం కలిగిస్తున్నావని ప్రశ్నించడంతో.. అతడిపై గణేశ్ దాడికి పాల్పడ్డాడు. గణేశ్‌తో వచ్చిన మిత్రుడు అక్కడి నుంచి జారుకున్నాడు. ఆ సమయంలో గదిలో ఉన్న కేశవ్‌సింగ్, అజయ్ వెంటనే హాస్టల్ నిర్వాహకుడైన నాగేశ్వర్‌రావుకు ఫిర్యాదు చేసేందుకు కిందకు వచ్చారు. దీంతో గణేశ్ తన వద్ద నున్న గడ్డం గీసే కత్తితో వెంకటరమణపై దాడి చేశాడు. గొంతు, చేయిపై కత్తితో దాడిచేసి, కోయడంతో వెంకటరమణకు తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయి మృతి చెందాడు. అనంతరం గణేశ్ అక్కడి నుంచి పారిపోయాడు. హాస్టల్ నిర్వాహకుడు, గదిలో ఉంటున్న కేశవ్‌సింగ్, అజయ్ పైకి వచ్చి చూడగా.. గదిలో వెంకటరమణ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే 108కు సమాచారమిచ్చారు. 108 అంబులెన్స్ సిబ్బంది అతడిన పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఆర్ నగర్ డివిజన్ ఏసీపీ పి.వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి సందర్శించారు. గదిలోకి గణేశ్‌తో వచ్చిన అతడి మిత్రుడిని ఆదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. హాస్టల్ నిర్వాహకుడు నాగేశ్వర్ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బోనమెత్తిన ఊరూవాడా..

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- బోనాలు సమర్పించి.. మొక్కుల చెల్లింపు..
- ఆకట్టుకున్న శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు

చేవెళ్లటౌన్: పోతరాజుల విన్యాసాలతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

చేవెళ్లటౌన్: బోనం ఎత్తుకున్న చిన్నారి

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, జూలై 28: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో బోనాల ఉత్సవాల్లో భాగంగా పోచమ్మ, ఈదమ్మ దేవాలయాల్లో పూజలు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

చేవెళ్లటౌన్, జూలై 28: చేవెళ్ల పట్టణంలో జరిగిన పోచమ్మ, దుర్గమ్మ తల్లి బోనాల పండుగ వైభవంగా జరిగాయి. ఆదివారం మహిళలు బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి నైవేద్యాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించారు. పోతరాజుల విన్యాసాలు, డోలు, డప్పుచప్పుళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, అమ్మవారిని కోరుకున్నట్లు భక్తులు తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎంపీపీ విజయలక్ష్మి రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు మాలతీకృష్ణారెడ్డి, చేవెళ్ల గ్రామ మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ అగిరెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు ఉన్నారు.

మొయినాబాద్ : మండల పరిధిలోని సురంగల్ గ్రామంలో మైసమ్మ, పోచమ్మ అమ్మవార్లకు భక్తులు బోనాలలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకొని నైవేద్యాన్ని సమర్పించారు. అదే విధంగా మొయినాబాద్, చిలుకూరు, శ్రీరాంనగర్, చందానగర్, హిమాయత్‌నగర్, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, చిన్నమంగళారం, తోలుకట్టా, నక్కలపల్లి, గ్రామాల్లో బోనాల ఉత్సవాలను నిర్వహించారు.

ఎస్‌బీపల్లిలో..

కొత్తూరు : మండల పరిధిలోని ఎస్‌బీపల్లిలో బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. శేరిగూ భద్రాయిపల్లిలో ఆదివారం జరిగిన బోనాల ఉత్సవాల్లో మాజీ జడ్పీటీసీ శ్రీలత పాల్గొని బోనమెత్తారు.

గోవిందాయిపల్లి తండాలో..

కడ్తాల్ : మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండా గ్రామపంచాయతీలలో ఆదివారం ముత్యాలమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన బోనాలతో ఆలయానికి చేరుకొని నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాములు, ఛత్రూనాయక్, మాజీ ఉప సర్పంచ్ శిరీష, సంతోష్‌నాయక్, నాయకులు సాయిలాల్, మాన్య, సేవా, శివరాం, వినోద్, మల్లేశ్, గణేశ్, భాస్కర్, నిరంజన్, రూప్‌సింగ్, రాజేందర్ పాల్గొన్నారు.

స్టేషన్ తిమ్మాపూర్‌లో..

కొత్తూరు : మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ డోలి రవీందర్ ఆధ్వర్యంలో బోనాలు అంగరంగా వైభవంగా జరిగాయి. ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ నాయకుడు దేవేందర్‌యాదవ్, కౌన్సిలర్ కొస్గి శ్రీనివాసులు హాజరయ్యారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలు అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజేందర్‌గౌడ్, మహేందర్, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

చేవెళ్ల రూరల్ : చేవెళ్ల మండల పరిధిలోని గ్రామాల్లో ఆషాడమాసం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం దేవునిఎర్రవల్లి, పామెన, మీర్జాగూడ తదితర గ్రామాల్లో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ల నడుమ అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలను జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మాణిక్యరెడ్డి, గోపాల్ రెడ్డి, అరుణ్‌కుమార్, జంగయ్యగౌడ్, విఠల్‌రెడ్డి, రామచంద్ర, పాండు, నర్సింహులు, దశరత్, శీను పాల్గొన్నారు.

గ్రామస్తులకు డప్పులు విరాళం..

చేవెళ్ల మండల పరిధి పామెన గ్రామస్తుడు దివంగత దావల్‌గారి మాణిక్యరెడ్డి జ్ఞాపకార్థం బోనాల ఉత్సవాల సందర్భంగా వారి కుమారుడు మాజీ సర్పంచ్ దావల్‌గారి గోపాల్‌రెడ్డి గ్రామస్తులుకు డప్పులను విరాళంగా అందించాడు.

చేవెళ్ల రూరల్ : పామెన గ్రామంలో..

చేవెళ్ల రూరల్ : దేవునిఎర్రవల్లి గ్రామంలో..

మొయినాబాద్‌లోని సురంగల్‌లోని పోచమ్మ ఆలయం వద్ద..

కొత్తూరు : ఎస్‌బీపల్లిలో ..

స్టేషన్ తిమ్మాపూర్ ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామ పెద్దలు

మొయినాబాద్‌లోని హిమాయత్‌నగర్ గ్రామంలో తొట్టెల ఊరేగింపు

గుంతల రోడ్డుకు మరమ్మతులు

మొయినాబాద్, జూలై28: మండల పరిధిలోని సురంగల్ పెద్ద చెరువు కింద పంచాయతీ రాజ్ రోడ్డు 100 మీటర్ల పొడవునా గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. దీంతో ఆ దారిగుండా వాహనదారులు వెళ్లాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ దుస్థితిని గమనించిన గ్రామ యువకులు రోడ్డును బాగు చేసేందుకు నడుం బిగించి ఆదివారం 41 ట్రాక్టర్ల మొరం పోసి రోడ్డును బాగు చేశారు. ఇప్పుడు వాహనాల రాకపోకలు సాఫీగా కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో సురంగల్ గ్రామ యువ నాయకులు సీతారాంరెడ్డి, ప్రభుయాదవ్, మధుసూదన్‌గౌడ్, ప్రశాంత్‌గౌడ్, వినాయకరెడ్డి, కుమార్‌యాదవ్, భూషన్‌గౌడ్, రాజేశ్‌యాదవ్, హరీశ్, రాఘవేందర్‌గౌడ్, నరేశ్, రాజేశ్, శ్రీనివాస్, కిట్టు, శ్రీధర్, మధు, చాకలి హరి ఉన్నారు.

చిన్నారెడ్డిగూడెం మాజీ సర్పంచ్ మృతి

మంచాల, జూలై 28: మంచాల మండలం చెన్నారెడ్డిగూడ మొట్టమొదటి సర్పంచ్‌గా గ్రామానికి సేవలు అందించిన మంచర్ల లాలూనాయక్ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. లాలూనాయక్ చెన్నారెడ్డిగూడ గ్రామాభివృద్ధి కోసం చేసిన సేవలను కొనియాడారు కార్యక్రమంలో వెంకటేశ్ యాదవ్, వెంకటేశ్, జంగయ్య యాదవ్, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

హయత్‌నగర్ రూరల్ , జూలై 28 : ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పాపయ్య, ఎస్సీ ఉపకులాల రాష్ట్ర అధ్యక్షుడు రాజలింగం ఆదేశాల మేరకు ఆగస్టు 9న ఢిల్లీ జంతర్ మంతర్‌లో నిర్వహించే మాదిగ, మాదిగ ఉపకులాల మహా ధర్నాను విజయవంతం చేయాలని ఎస్సీ 57 ఉపకులాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానాల మంగేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, జూలై 28 : వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురి నృత్యకారుల ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో కువైట్ నుంచి విచ్చేసిన కూచిపూడి నాట్య గురువులు చల్లా వేదవల్లి ప్రసాద్ తన శిష్య బృందంతో కలిసి నర్తించిన పలు ప్రదర్శనలు ఆద్యాంతం ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలో విష్ణు ప్రియ, ఆరాధ్య, నేహా, వేదశ్రీ, ధన్య, శ్రీమోహన, సాయిమణి శ్రీరాగ, వైష్ణవి, కార్తీక, సంజన, షణ్ముఖ లక్ష్మి, సౌమ్య, అనన్య పాల్గొన్నారు.

చలమారెడ్డికి ఘన నివాళి

మంచాల, జూలై 28: తెలంగాణ రాష్ట్ర పోరాటయోధుడు, రంగారెడ్డి జిల్లా జేఏసీ అధ్యక్షుడు దివంగత వెదిరే చలమారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ సికిందర్‌రెడ్డి, నాయకులు చంద్రయ్య. యాదయ్యగౌడ్. వెంకటేశ్ యాదవ్, హనుమంత్‌రెడ్డి. సురేశ్ పాల్గొన్నారు

కడ్తాల్‌లో జైపాల్‌రెడ్డి వర్ధంతి

జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్, జూలై 28: మండల కేంద్రంలోని హైదరాబాద్ -శ్రీశైలం జాతీయ రహదారిపై కేంద్ర మాజీ మంత్రి దివంగత జైపాల్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జైపాల్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నర్సింహ, బిచ్చనాయక్, బిక్యానాయక్, భాస్కర్ రెడ్డి, హన్మనాయక్, వెంకటేశ్, వేణుగోపాల్, లక్ష్మణ్, రాజేంద్ర గౌడ్, నరేశ్‌నాయక్ పాల్గొన్నారు.

మూసారాంబాగ్‌లో చోరీ

మలక్‌పేట, జూలై 28: ఇంట్లో దాచిన బంగారు నగలు, రూ.17,500 నగదు చోరీకి గురైన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూసారాంబాగ్‌లో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. మూసారాంబాగ్‌లోని జహీర్ రెసిడెన్సీ నాలుగో అంతస్తులో నివాసముండే డాక్టర్ అయేషా ఫర్వీన్ ఈ నెల 15న తన బంగారు నగలను తన పడక గదిలోని దాచిపెట్టారు. 26న నగలు చూడగా కనిపించలేదు. నగల పక్కనే దాచిన నగదు కూడా కనిపించలేదు. ఆందోళనకు గురైన ఆమె ఇంట్లో పని చేసే అను, కౌసర్, ఇన్నాను అడిగింది. వారి నుంచి పొంతనలేని సమాధానాలు రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మలక్‌పేటలో పెరిగిన నేరాలు..

మలక్‌పేట పీఎస్ పరిధిలో నిత్యం ఏదో ఒకచోట దొంగతనాలు జరుగుతున్నాయి. పోలీసుల నిర్లక్ష్యం వల్లే నేరాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే, నేరాల సమాచారం మీడియాకు చేరకుండా పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. ప్రధానంగా దిల్‌సుఖ్‌నగర్, గడ్డిఅన్నారం ప్రాంతాల్లో దొంగతనాల కేసులు అధికంగా నమోదవుతున్నాయి. ఈ కేసులపై మీడియా ప్రతినిధులు సమాచారం అడగ్గా.. ఏమి లేదంటూ తెలపడం మలక్‌పేట పోలీసులకు పరిపాటిగా మారింది. మీడియా ప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వవద్దని కిందిస్థాయి అధికారులు, సిబ్బందికి ఇన్‌స్పెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

దుండగుల దాడిలో వృద్ధుడి మృతి

సుల్తాన్‌బజార్, జూలై 28: గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన బేగంబజార్ పీఎస్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ కథనం ప్రకారం.. యాకుత్‌పుర ప్రాంతానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ హకీం(72) కొంత కాలంగా ఫీల్‌ఖానాలో దుకారణం ఏర్పాటు చేసుకొని వాహనాల ఎలక్ట్రీషియన్ పనుల చేస్తున్నాడు. రోజు మాదిరిగానే శనివారం ఇంటి నుంచి బయలు దేరిన మహమ్మద్ అబ్దుల్ హకీం రాత్రి తిరిగి ఇంటికి వెళ్లకపోవడంతో కంగారుపడ్డ కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం ఫీల్‌ఖానాలోని దుకాణానికి వచ్చి తెరిచి చూడగా.. హకీం విగతజీవిగా పడి ఉన్నాడు. దీంతో కుటుంబ సభ్యులు బేగంబజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అబ్బుల్ హకీం తలకు బలమైన గాయం కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడని పోలీసులు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు తలపై బలంగా కొట్టడం వల్లే తలకు గాయమై మరణించి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు